



కొందరు చాలాకాలం ప్రేమించి విసుగెత్తుతారు. కొందరు చాలాకాలం విసుగెత్తి ప్రేమిస్తారు. కొందరు విసుగెత్తి ప్రేమించి, ప్రేమించి విసుగెత్తి....యిలా అనేకమార్లు చేస్తారు. అలా చెయటానికి వాళ్ళను తప్పు పట్టవలసిన అగత్యం ఏమీ లేదు. "అంతా వాడి లీల! మనం నిమిత్తమాత్రులం!" మూడవ కోవకి చెందినవాడు జనార్ధనం. సన్నగా వుంటాడు. కొనవలసినవన్నీ కొని తినవలసినవన్నీ తిని.... వేసుకోవలసినవన్నీ వేసుకొనీ బలహీనంగా వుంటాడు. అతన్ని అడిగితే.... "మనిషినలా కనిపిస్తాను కానీ అయామ్ జెమ్. మీ యిష్టం, ఏమయినా యివ్వండి. అయిదు తప్పితే పది నిముషాలు! దట్సాల్! పూర్తి చేసిపారేస్తాను. ఫర్ యువర్ యిన్ఫర్మేషన్ .... లేడిస్‌తో సహా!" అంటాడు నవ్వుతూ.

చాలామార్లు ప్రేమించటంవల్ల అనుమానం, చాలామార్లు విసర్జించటంవల్ల పెనుభూతం.... అతనికి సంక్రమించాయి. పెళ్ళిలోనే పీటల




మీదనుంచే అందరి వయిపూ అనుమానంగా చూసాడు. 'ఎవడయినా కాకి ముక్కుకి దొండ పండులా వుంది సుమా!' అన్నట్లు చూస్తాడేమోనని. పెళ్ళాం వయిపు చూసాడు.

చూడటం అన్నది ఒక్కటే క్రియ. అయితే చూపులు అన్నీ ఒక్కటేనా? అవదు. పిల్లలు పొడిచేవాళ్ళు! 'ఓడిపోయిన ఎమ్మెల్యేలా' దగ్గర్నుంచి తోకాడిస్తూ తిన్న ఒకే ఒక్క బిస్కట్‌కే పదిరోజులదాకా విడిచిపెట్టకుండా వెంట తిరిగే కుక్కలా! 'నువ్వు నాకు ప్రాణం అని మనస్ఫూర్తిగా పలికే పురుషుడికి బదులీయలేని మూగ పిల్లలా ' వరకూ చూపులు ఎన్నిరకాలు! జనార్దనం పెళ్ళి పీటల మీద భార్యను చూచిన చూపులో .

లేత తమలపాకు పచ్చదనంలోని మెరుపు నిండిన భార్య కళ్ళవయిపూ. వేళ్ళవయిపూ మెచ్చుకోలు లేదు.

ఆమె కొత్తది కాదు. ఆమె అందం కొత్తది కాదు. చాలామార్లు ప్రేమించి విసుగెత్తి .ఎట్టకేలకు కట్నం, అందం, ప్రేమ, తలిదండ్రులకు నచ్చుబాటూ యిన్నీ కుదిరిన అమ్మాయినే చూసుకొన్నాడు. ఆమె పేరు 'జోగుమాంబ'. పక్కింట్లోదే. అయినా పెళ్ళాడాలనుకున్నప్పుడూ ప్రేమించాలనుకొన్నప్పుడూ ... కనుపించవలసినదానికన్న అందంగా కనిపించటం అత్యవసరం. 'జోగీ!' అని పిలిస్తే బాగోదు. అయినా ఆ అసౌకర్యాన్ని భరించటమనే త్యాగంచేసి అలాగే పిలిచి చేరువ చేసుకోటానికి—

"జోగీ! నేను సన్నవే! అయితే నా మనసు చాలా విశాలం! ఎంత విశాలమంటావా? నువ్వూ నీ అందం నిండిన కళ్ళూ . నీ చక్కటి పచ్చని పాదాలూ ..నీ పిల్లలూ వాళ్ళ అభివృద్ధీ. . నీ పాటా యివన్నీ వరసాగా నా గుండెల్లో నిండిపోయినా యింకా కొంచెం చోటుంటుంది. ఆ చోటులో.. ఏం చెప్పమంటావ్! ఎంత బాధ వుంటుందో. ! ఇంకా నీకు ఏదేదో చేయాలనీ, ఏదీ చేయలేకపోతున్నాననీ అర్థంలేని, అంతులేని దురాశ! పేరాశ! చిరాశ!"

ఆమె వింది. వీధి అరుగు దిగింది. "అత్తయ్యగారూ! మా అమ్మ యీ అప్పడాలు యిమ్మంది" అంటూ .తన పెద్ద పెద్ద కళ్ళతో సన్నపాటి జనార్దనం కోసం వెదికింది. కన పడగానే మొదట్లో పారిపోయేది. ఆ తర్వాత ప్రయత్నించి మరోసారి యత్నించి నాలు గవసారే గాబోలు మానేసింది.

'ఒద్దు' ఒద్దంది నోటితో.

"జీవించినా, మరణించినా నీవే నేను నేనే నీవు' అంటున్న పెదాల వైపు వేయివత్తులతో వుజ్జ్వలంగా ప్రకాశిస్తున్న హారతి పళ్ళాలవంటి కళ్ళతో చూసింది.

"ప్లీజ్! ప్లీజ్!"

ఇరువయిపులా అభ్యర్థన! విడవమని కప్ప! మింగుతానని పాము!

పెళ్ళిపీటలమీద కూర్చుని పెళ్ళాన్ని చూస్తున్న జనార్దనం చూపులో 'తనే కప్ప యేమో!' అనే భయం! అనుమానం! కాని కరిణీకం పుస్తకాల్లో అతని పేరన మరో పది ఎకరాలు పెరగటంలో ఏ అనుమానమూ లేదు.

అతనిని తెలిసున్నవాళ్లు 'గొప్ప చలాకీ వాడు! మాటల్తో కడుపు నింపేస్తాడయ్యా!' అంటారు. పెళ్ళయి పెళ్ళిపీటలు విడిచి. . పెళ్ళి బట్టలు వదిలి కార్యంబట్టలు కట్టి గదిలోకి అడుగు పెట్టిన వెంటనే ఆమె 'కడుపు'నే కాదు 'గుండెల్ని' కూడా తన మాటల్తో నింపేసాడు.

"అయిపోయిందేదో ఎలాగూ అయి పోయింది. నా కర్మమో నీ కర్మమో! మొత్తంమీద ఒకళ్ళపాల ఒకళ్ళు పడ్డాం. యిక్కణ్ణించి నేన్నీకో మాట యిస్తున్నాను. నిన్ను తప్పమరెవత్తినీ చూడనుగాక చూడనని! నువ్వు కూడా .అలాగే నాకు మాట యివ్వాలి.. . అంటే నా వుద్దేశం నువ్వు చెడ్డావని కాదు! ఓవేళ చెడినా. నేను చాలా మంచివాణ్ణి! నీకే అపకారమూ చెయ్యను! క్రూరతనం! వెధవది! ఎన్నో నీతులు చెపుతుం టాను నేను. అలాంటిది నేను మాత్రం తక్కువ తిన్నానా? యికపైన మనం ఒకళ్ళ నొకళ్ళు నమ్మాలి. ప్రేమించాలి. వంచించగూడదు. అలా మాటిస్తావుగదూ!" అంటూ పాణి గ్రహణం చేసాడు.

"ఎంత మధురంగా వుందా చేయి! అయితే మాత్రం... ! చెయ్యి ఎవడో యింతకు ముందే తాకినదయితే ? హోటలుకి వెళ్ళి మంచినీళ్ళు తాగే గ్లాసును కొంచెంసేపు వాడేదే అయినా ఎవడయినా ఎంగిలిచేసిపోయినదేమోనని పరిశీ లిస్తాంగదా! అలాంటిది జీవితాంతం వాడుకొనే వస్తువు విషయంలో తగు జాగ్రత్త వహించ టంలో తప్పేముంది?" అనుకున్నాడు.

కార్యం గదిలో తొలిసారిగా నింపబడిన గుండెలు కాపురానికి వెళ్ళేనాటికే కన్నీటి కుండలయినాయి. కార్యంనాటి మాటల్తో 'మనిషికి ఒక్కోరకం పిచ్చి' అని సరిచెప్పు కున్న జోగుమాంబ 'జనార్దనానికి ఒక్కటే పిచ్చి' అని నిర్ణయించుకోటానికి ఎక్కువ సమయం పట్టలేదు.

ఆ పిచ్చి సినిమాహాల్లో కార్నర్ సీట్లు దొరికేవరకూ గేటువద్ద నించోబెట్టింది. ఎంద రినో బ్రతిమలాడుకొని సంపాదించిన సీట్లు విజయంతో తృప్తిపడని పిచ్చి—పక్క సీటు వాళ్ళు 'ప్లీజ్ డోంట్ మేక్ నాయిస్' అనే దాకా తిట్టించింది. ఆపైన సణుగుడుతో సినిమా చూడకుండా చేయించింది.

"ఏమండీ బీచ్‌కి వెళ్దామా?"

"ఎవడైనా వస్తానన్నాడా సైటు కొట్ట డానికి?"

ఇంటికి వచ్చేసరికి తలుపు మూసుంటే

"తలుపు! తలుపు!"

"వస్తున్నా!"

"ఏం యింతాలశ్యం? ఎవడ్నయినా పంపించ టంలో లేటా?"

తలుపు వద్ద నిలుచుని నిరీక్షిస్తూంటే. . ?

"వీధిలో నించున్నావేం? వచ్చేపోయే వెధ వలకి పని లేకపోతే మానె. నీకయినా లేదా! పద లోపలికి. !" సొంటి పిక్క!

తలుపులు జారేసి ఉంటే .

"పంపించేసాక తలుపులు వెయ్యటానికి గూడా శక్తిలేకపోయిందిటే ?" తొడపాశం!

తోడపాశాలు... సొంటి పిక్కలు సన్నని జనార్దనానికి ఆయాసం కలిగించేంత కష్ట మయిన పనులు గావు. తన్నేకొద్దీ ఆమె అందం పెరుగుతున్నట్లుగా కనిపిస్తోంది అత నికి! "కొంప ముంచేసుకున్నానేమో! మోస పోతున్నానేమో!" అతని బాధ. ఆఫీసులో వుండలేడు. మధ్యాహ్నం సెలవుపెట్టి హఠా త్తుగా పర్యవేక్షణకోసం యింటికి చేరుకుం టాడు. ఆమెలో తప్పు దొరకనికొద్దీ. . ఆమె నేర్పరితనంపట్ల భయం యినుమడించేది. ఏమిటో అడుగుతాడు! వెళ్తాడు! వస్తాడు! తంతాడు! తిడతాడు!

జోగుమాంబకు ఒక పిల్లాడు పుట్టాడు. రోజులు లెక్కపెట్టాడు. ఇంచుమించుగా కడుపు వచ్చేనాటికి తన దగ్గరే వున్నట్టు తోచి పిల్లాడు సగం అందంగా కనిపించాడు.

జనార్దనాన్ని కొట్టకుండా తిట్టకుండా ఆప్యా యంగా దగ్గరికి పిలిచి నోట్లో నోరు పెట్టకుండా బుజ్జగించి "ఏంటిరా యీ పని?" అంటూ అడిగితే . ?

"ఏం లేదు గురూ! అందరికీ వున్న బాధే! అది మంచిదే! కాకపోతే ఏలుకుంటానేంటి? అయితే మంచిదాన్ని మంచిగా చూద్దం మంచిపనికాదు! చూ స్తే గ్యారంటీగా స్పాయిల్ అయిపోతుంది. తప్పదు! అందుకే మన జాగ్ర త్తలో మనం వుండాలి. అంతే " అంటాడు నవ్వుతూ.

"కాదు సుమా! యింకా ఏదో కిటుకు వుంది. నువ్వు నాతో మనసువిప్పి మాట్లాడం లేదు...." అని మరీ మొహమాట పెట్టేస్తే..

"మరోలా అనుకోకు గురూ! యిందులో నా తప్పు యీషణ్మాత్రం కూడా లేదు. నా శాయశ క్తులా శ క్తికి మించి కూడా—అఫ్ కోర్స్ నీకు మాత్రం తెలియదేంటీ—సుఖ పెట్టాలని ట్రై చేస్తాను. కాని ఏం లాభం? ఒక్కసారి కూడా దాని పిడికిళ్ళు మూతపడవు. కళ్ళు మూతలు పడవు. పళ్ళు బిగవ్వు! ఒక్క కలవరింత ..ఒక్క మధురమయిన తిట్టు. మన నవలల్లో రాసినట్టు ఆ నోటమ్మట రాదు. అది సుఖపడలేదనటానికి యింతకన్న ప్రూఫ్ ఏం కావాలి? మగాణ్ణి నేను! నేనే ఎప్పుడయినా అందుబాటులో లేకపోతే నానాబాధ పడిపోయి పొరపాట్లు చేస్తుంటానే! అలాంటిది ఆడది! మగాడికన్న ఎనిమిదిరెట్లు ఎక్కువ వుంటుంది దానికి. నాది కేవలం అనుమానమే. తప్పే. అయితే మాత్రం ? అన్నీ తెలిసుండీ అను మానించటంలో తప్పేముంది? ఆ మాటకు వ స్తే మనం రాముడిని 'గాడ్' అంటాం. ఆ గురుడు అఫ్‌కోర్స్! ప్రజల పేరు చెప్పుకొన్నా డనుకో! అనుమానించలేదా? తను బ్లాక్ ఫెలో నని యిన్‌ఫీరియారిటీ ఫీలయి వుండడంటావా? యింకా గట్టిగా వాదించాల్సి వ స్తే అనుమా నించటం అసూయపడటం ప్రేమకు లక్ష ణాలు. నీ పెళ్ళాన్ని నువ్వెప్పుడు అనుమా నిస్తావ్? నువ్వుదాన్ని ప్రేమించినప్పుడు! అంటే దాన్ని సుఖాన్ని రికగ్నైజ్ చేసినపుడు! అసలు అనుమానించటం భారతీయుల జన్మ హక్కు! అది నిత్యవిధి! జీవన వ్యాపారం " అంటూ నువ్వింకా వింటూవుంటే మాట్లాడు తూనే వుంటాడు. "సర్లే! వస్తా " అంటూ నువ్వు గుడ్‌బై కొట్టెయ్యబోతే..

"ఓ చిన్న విషయం... మనలో మనమాట! పైకి అనకపోయినా లోపల్లోపలయినా ఆ మాత్రం యీ మాత్రం అనుమానించకుండా ఆడదాన్ని ఏలుకొనే వెధవన్నర వెధవన్నర వెధవ యెవడయినా యీ భూప్రపంచంమీద వుండి వుంటే....యేఁవనుకోకు! వాడు ఉత్త కొజ్జా అంటే తృతీయ ప్రకృతి అయుంటాడు" అంటూ నిన్ను పరుగెత్తిస్తాడు.

తన ఆ స్తిని తను పదిలపరచుకొనే బాధ్య తతో జనార్దనం ఆలోచించిన పథకాలలో విసూ తన మయినది 'తలుపు గొళ్ళెం' పథకం!

విధానం:—భార్యను యింటిలోనే వుంచి ఆఫీసుకు వెళ్ళేటప్పుడు బయటకు పోయే తలుపులకు గొళ్ళెములు మాత్రము పెట్టుట.

ప్రయోజనములు. 1) భార్యకు బయటకు పోయే అవకాశం లేకపోవటం 2) బయటవాళ్ళు ఎవరయినా చూసి 'యిదేమిట'ని అడిగితే. ..

'ఆఫీసుకు పోతూ పొరపాటున గొళ్ళెం పెట్టానని చెప్పుకోవచ్చు. 3) ఏ దొంగయినా వస్తే.' 'గొళ్ళెం పెట్టివుంది. యింటివాళ్ళు యిక్కడే ఎక్కడో వున్నారన్నమాట! ఎందుకొచ్చిన రిస్క్?. ' అనుకొని భయముతో నిష్క్రమించుట.

అవరోధములు: 1) చుట్టుప్రక్కల వెధవలు ఎవరయినా రోజూ యీ తంతు గమనించితే .. ? ఏడిసారు? పట్నంలో ఎవడి బాధ వాడిది. మరీ అసహ్యంగా వుంటే రెండు మూడు నెలలకో యిల్లు మార్చేస్తే సరి! 2) ఆ ముండ ఒప్పుకుంటుందా? ఎద్దునడిగి ఎవడయినా కాడికి కడతాడా? చచ్చినట్టు అదే ఒప్పుకుంటుంది. యీ విధంగా ఆలోచించి ఆలోచించి జనార్దనం ఓ నిశ్చయానికి వచ్చేశాడు. యింత చక్కని పథకం చాలా ఆలశ్యంగా వచ్చినందుకు కొంతసేపు విచారమూ .... ఆలస్యంగానైనా వచ్చినందుకు మరి కొంతసేపు ఆనందమూ నర్తించిన మనసు గలవాడయి జనార్దనం మర్నాటినుంచే ఆ నిర్ణయాన్ని అమలు జరిపేసాడు.

"కాని . ఏం చెప్పగలం? మనసుంటే మార్గంలేదా? అందులోనూ ఆడది మాయల మారి!" హఠాత్తుగా వచ్చిన ఆలోచనతో ఆదరాబాదరా బయల్దేరిన జనార్దనం యింటికి చేరుకొనేసరికి

యింటి ముందు పెద్ద గుంపు పోగయి వుంది! గుంపు మధ్యలో ఓ వ్యక్తి రెండు రెక్కలు విరిచి పట్టుకున్నారు! "కొట్టండి! తన్నండి! దొంగ వెధవని!" కేకలు!

"దొంగ ముండా వెధవని పోలీసువాళ్ళకి వప్పగించేస్తేసరి!"

"పట్టపగలే! వార్నీ! ఎంత దవుర్జన్యం?"

"ఆడకూతురు ఒంటరిగావుంటే కనిపెట్టాడన్న మాట!"

అయిదు నిమషాల్లో విషయం అర్ధమయిపోయింది.

బిచ్చంకోసం అరిచి అరిచి ఆ ముష్టివాడు-యింటి సమీపంలో మనిషి అలికిడి అవకపోవడంతో —— తెగించి లోపలికి దూరాడు! యింకేముంది? జోగుమాంబ అరుపులు! జనం పోగవటం! ఆ చుట్టుపక్కల వాళ్ళకు ఆ యింట్లో దిగిన ఆడమనిషిని చూసే అవకాశం లభించింది.

'దొంగ'అనేసరికి ఒక భయం . ఒకఉత్సుకత....కలగటం సహజం!అటువంటి భయానికీ ఉత్సుకతకీ లోపడిన మనసు కొంత స్వాభావికతను కోల్పోతుంది. జోగుమాంబ విషయంలోనూ సరిగా అదే జరుగింది. జరిగిన సంఘటన భర్తకు ఉత్సాహంతో వివరించే ప్రయత్నంలో రెండుమూడు వాక్యాలు వెలువడ్డాయి. పెను మబ్బులు భయంకరమయిన గాలికి చెదిరిపోయినట్లుగా ఆమె మాటలు అతని చూపులకి తగిలి చిట్లిపోయి చెదరిపోయాయి!

"చావకూడదా దొంగ ..ండ!" అందరూ వెళ్ళిపోయాక అన్ని తలుపులూ బిగించి జనార్దనం ఓ నలహా పారేసాడు. ఆరోజు రాత్రి వండిన అన్నం కుళ్ళి కాలవ పాలయింది! మంచంమీద తెల్ల దుప్పటి పాతబట్టల పాలయింది! అతని ఆకలి కడుపు హోటలు మెతుకుల పాలయితే ఆమె ఆకలి కడుపు కన్నీళ్ళ పాలయింది! చంటిబిడ్డ నోట్లో చిక్కుకున్న స్తనంతో నిస్త్రాణగా పడున్న జోగుమాంబ - సుష్టుగా భోంచేసి వచ్చిన జనార్దనానికి వీధిలో నిలబడి ప్రదర్శనలిచ్చే వేశ్యలా కనిపించింది! కసిగా ఒక్క తాపుతన్ని చంటిదాని ఉచ్చ గోనెను కాలితో ఆమెమీద పడేశాడు! రాత్రంతా కురిసిన వానలో జ్వరంతో కదల్లేని భిక్షగత్తె బిడ్డను రక్షించుకోటానికి పక్కలో లోపలికంటా దాచుకుని తనుమాత్రం మరణించినట్లుగా చంటిబిడ్డను పొదవుకొని జోగుమాంబ పడుకొంది!

నాలుగయిదు రోజులయింది!

ఆరోజు అనుకోని సమయంలో జోగుమాంబకు బాత్రూం అవసరం వచ్చింది. బయట గొళ్ళెం! కడుపులో నరాలు బిగబట్టుతున్నాయి! మరోపిల్ల కడుపులో కదులుతున్న రోజులు! పిచ్చెక్కినట్టుగా వుంది. ఏం చేయాలో తోచటం లేదు! అరిస్తే....ఆ కాంపౌండ్ వాల్

దాటి అవతల యిళ్ళకు శబ్దం పోయే అవకాశం తక్కువ! ఆపద్బాంధవుడిలా కనుపించాడామెకు దొడ్డి ఊడవటానికి వచ్చిన పాకీవాడు!

కిటికీలోంచి చప్పట్లుకొట్టి పిలిచింది.

"బాబు మరిచిపోయి గొళ్ళెం పెట్టేశారు! తియ్యి!"

బాత్రూం నించి తిరిగి వచ్చాక యింటిలోపలకు వెళ్ళిపోబోయింది. అకస్మాత్తుగా ఆమెకు ఆలోచన వచ్చింది. 'జనార్దనం వచ్చి ఎవరు గొళ్ళెం తీసారని అడిగితే....??. దొడ్డి ఊడిచి వెళ్ళిపోతున్న పాకీవాణ్ని ఆపింది.

"ఒక్క సాయం చేస్తావా తమ్ముడూ!" కులం ఆభిజాత్యం ధనం అహంకారం. అన్నీ నశించిన యోగిలా ఆ గొంతులో లాలిత్యం అర్థింపు!'

"చెప్పండమ్మగారూ" అన్నాడు.

"నేను లోపలికి వెళ్ళగానే బయట మామూలుగా గొళ్ళెం పెట్టెయ్! యీ విషయం ఎవరితోనూ చెప్పకు! అర్ధరూపాయి యిస్తాను."

సరిగ్గా ఆమె అర్ధరూపాయ ఇస్తున్నప్పుడు.

జానార్దనం ప్రవేశించాడు!

పాకీవాణ్ణి ఛావగొట్టినంత పనేస్తాడు! 'లంజా కా! పెద్దంతరం చిన్నంతరం లేకుండా యేదుస్తున్నావ్!" అంటూ చేతులు నొప్పిపెట్టేదాకా బాదాడు!

"ప్లీజ్! జరిగినది చెప్పకు! మా పరువు తీయకు!" అన్న అభ్యర్ధన నిండిన జోగుమాంబ చూపులకి అతను కట్టుబడిపోయాడు! చుట్టూ చేరిన జనానికి "ఏవుంది! ఒంటరిగా వుందిగదా అని యింట్లో దూరబోయాడు! అది అరుస్తోంది! సమయానికి వచ్చాను కనక సరిపోయింది గాని. . లేకపోతేనా !!" అంటూ వివరించి వాళ్ళ 'పిటీ' మూటగట్టుకున్నాడు! అందరూ వెళ్ళిపోయాక భార్య చేయిపట్టుకుని వంట గదిలోకి ఈడ్చుకుపోయాడు!

"చూడు! నిన్నేం చేస్తానో లంజకానా!"

స్టౌ వెలిగించాడు! అట్లకాడ తీసాడు!

జోగుమాంబ భయంతో వణికిపోయింది! నరమాంస భక్షకుల పాలబడిన ఆకలితో మాడుతున్న పేదపిల్లలా వణికిపోయింది! వేడుకుంది! ఏడిచింది!

యింక ఏంచేసినా విడవనంటూన్న పులి మీదకు తిరగబడిన ఆవులాగ స్టౌను కిందకు తోసేసింది! చేతిలో అట్లకాడ లాక్కుని విసిరేసింది!

జనార్దనం నిశ్చేష్టుడయాడు! అంతకుమించి భయపడ్డాడు! కొద్ది సేపటిలోనే కోలుకున్నాడు!

"ఆల్ రైట్! ఆడదాన్ని నమ్మమని ఎవడు చెప్పాడు! నా జాగ్రత్తలో నేను వుండటం నా ధర్మం! నా హక్కు!"

గబగబా తాళాల గుత్తి తీసుకున్నాడు! యింటిలో వున్న మూడు కప్పలనీ తీసుకున్నాడు! బయటికి పోయే తలుపులన్నిటికీ గొళ్ళాలు తగిలించి తాళం వేసేసాడు! వీధి గుమ్మానికి కప్ప తక్కువయింది. తలుపుకి గొళ్ళెంపెట్టి. .తాళం కప్పకోసం బజారుకు బయల్దేరాడు.

అతను తిరిగి వచ్చేసరికి రెండు తలుపులూ బార్లా తెరిచి వున్నాయి! లోపల జోగుమాంబకు బదులు ఆమె ఉత్తరం వుంది!

"నువ్వు పెట్టిన తలుపు గొళ్ళేనికి తాళం కప్ప వేసెయ్యకముందే తప్పుకుంటున్నాను! యీ లోకంలో ఏడిచే వాళ్ళున్నంతకాలమే ఏడిపించేవాళ్ళ రాజ్యం చెల్లుతుంది! ఇంతకాలం 'పెళ్ళి' అన్నది జీవితానికి గమ్యమనీ అందులో ఎదురయే కష్ట సుఖాలు లిఖితాలనీ నచ్చజెప్పుకున్నాను. 'ప్రేమ' అన్న మత్తులోనూ 'మగవాడు అమాయకుడు . బలహీన మనస్కుడు' అని నాకు నేను కల్పించుకుని వంచించుకున్న భ్రమలోనూ నువ్వు ఎన్ని తలుపులు మూసినా భరించాను! యిది కేవలం నా పిరికితనమన్న నిజాన్ని అంగీకరించి అసహ్యం కలిగి. యీ తుప్పుపట్టిన తలుపు గొళ్ళాన్ని విరగగొట్టుకొని వెళ్ళిపోతున్నాను . !"

'పెళ్ళి' అన్నది మగవాడు ఆడదాని బ్రతుక్కు వేసే గొళ్ళెమే అయితే....అది తుప్పు పట్టడం... విరగగొట్టబడటం తప్పనిసరే మరి!!! □